# Need of Teaching Philosopy as Core Subject in Schools and Higher Education

## పాఠశాలల్లో ప్రధానాంశంగా తత్త్వశాస్త్ర బోధనావశ్యకత

(ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ సెమినార్, ఉస్మానియా యూనివర్సిటీ )

డా. జి. అరుణకుమారి
17. 03. 2010

**పాఠశాలల్లో తాత్త్విక బోధనల స్వరూపం:**

నైతిక విజ్ఞాన శాస్త్రం పేరుతో Moral Science విలువల శాస్త్రంగా Value Education గా ఆక్స్‌ఫర్డ్ ప్రచురణలు, ఇతర ప్రచురణ సంస్థల పుస్తకాలు 1వ తరగతి నుండి 6వ తరగతి వరకు ప్రధాన ప్రధానాంశంగా ఉన్నప్పటికీ ఈ ప్రధానాంశానికి పరీక్షలు నిర్వహించటం లేదు. వారానికి ఒక క్లాసు ఉంటుంది. నైతిక విజ్ఞాన శాస్త్రంలో ఏడు సంకలనాలు కనిపించాయి. ఒక్కొక్క పుస్తకంలో తాత్త్వికాంశాలకు చెందిన పాఠాలను ముఖ్యంగా పరిశీలించాను.

మొదటి పుస్తకంలో 'Honest Ways' అనే కథలో బాలుడు తోడేలు వచ్చిందని రెండుసార్లు అబద్ధాలు పలికి మూడవసారి మృత్యువాతపడిన బాలుడి కథ. అబద్ధాలు చెప్పేవారిని ఎవరూ విశ్వసించరు అనే నైతిక విలువను వివరిస్తుంది. ఈ కథలో చెప్పవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి. సత్యవచనం ఒక యజ్ఞం లాంటిది. దానిని పాటించటం ఒక తపస్సు. చెప్పరాని సందర్భం వచ్చినపుడు మౌనం పాటించడం ఉత్తమం అనే విషయాలను పిల్లలకు బోధించాలి.

Spread magic words through sweet words అనే పాఠంలో Sorry, Thank You, Please పదాల ప్రయోగం, విలువలను వివరించారు. పెదాలనుండి జారే పదాలకన్నా హృదయాంతరాళం నుండి వచ్చే మాటలకు మథనం అవసరం అనే అంశాలను వివరించాలి.

రెండవ పుస్తకంలో Spread happiness through a smile kindness.

మూడవ పుస్తకంలో Listen to your elders, Respect our workers, Looking after Mother Nature.

నాల్గవ పుస్తకంలో Being punctual, Forgiving others, Caring for others, Love is sweet.

ఐదవ పుస్తకంలో Using your time. దీనిలో బామ్మ ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో ఎన్నదగిన పనుల వర్గీకరణను విద్యార్థినికి (మనమరాలికి) సూచిస్తుంది. హోమ్‌వర్క్, స్కూలుకు తయారుకావడం, పని ప్రాధాన్యత డాన్స్, డ్రాయింగ్, పేయింటింగ్ వంటి వాటికి ద్వితీయ తృతీయ స్థానాలు కల్పిస్తుంది. సమయ పాలనను, పెద్దల పర్యవేక్షణను సూచిస్తుంది.

ఆరవ పుస్తకంలో The making of a Leader - Vinobha Bhave.

ఏడవ పుస్తకంలో Meaning of friendship, Buddha, Ashoka మొదలైన వారిని గురించి పాఠాలున్నాయి. ఈ పాఠాలు ప్రవర్తన పద్ధతిని (behavioural pattern) వివరిస్తున్నాయి.

ఇక ఇంగ్లీషు వాచక పుస్తకాలను గమనించినపుడు గద్యపద్య భాగాలున్నాయి. 6 నుండి 10వ తరగతి వరకు ఉన్న పాఠ్య పుస్తకాలలో రవీంద్రనాథ ఠాగూరు, వినోబా, మదర్ థెరిసా పాఠాలు కనిపిస్తాయి. 6 నుండి 10వ తరగతి తెలుగు వాచకాలలో సాహిత్యాంశాలు పరిపుష్టిని కలిగి ఉన్నాయి. అంబేద్కర్ వ్యక్తిత్వం, మదర్ థెరిసా వంటి తాత్త్విక పాఠ్యాంశాలతో పాటు యాత్రా చరిత్రలు, లేఖ, కథలు, ప్రాచీన సాహిత్యంతో పాటు అనేక రచయితలను పాఠకులకు పరిచయం చేయాలనే దృష్టి కనిపిస్తుంది.

**క్షేత్ర పర్యటన – సర్వేక్షణ :** Moral Science వలన పిల్లలు గ్రహించగలిగే అంశాలున్నాయని, కొంతవరకు మేలని అన్నారేగాని సంతృప్తికరమైన సమాధానం ఉపాధ్యాయుల నుండి రాలేదు.

మూడు సంవత్సరాల క్రితం ఇంగ్లీషు వాచకంలో మదర్ థెరిసా పాఠం చెప్పి తరగతిలో ఎంతమందికి సామాజిక సేవ చేయాలని ఉందని అడిగినపుడు క్లాసులో 75% చేతులెత్తారు. కాని ఈనాడు ఇద్దరు చేతులెత్తడం గగనమయ్యింది. దీనికి సమాధానంగా ఒక పాఠశాల అధ్యాపకురాలు పిల్లలలో సున్నితత్వం పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. ఒక్క కారణంతో ఒక్క సమస్యను వీక్షించటం సమర్ధనీయం కాదు. దానికి అనేక కారణాలను ఊహించవలసి ఉంటుంది. పిల్లలలో సున్నితత్వం పోయింది అనే దానికన్నా అబద్ధాలాడటం ఇష్టంలేదని భావించవచ్చు. అధ్యాపకురాలిని సంతృప్తి పరచాలనే నెపంతో చేతులెత్తే దానికన్నా వాస్తవం పలకటం ఉత్తమం కదా. పిల్లలలో అలసత్వానికి కారణాలుగా ఈ కారణాలను అధ్యాపకులు సూచించారు.

1. టి.వి 2. పరిమిత (Unitary) కుటుంబాలు 3. వ్యక్తి ప్రధాన (Self Centred) భావాలు
4. హిపోక్రసీ 5. స్వతంత్ర ఆలోచన లేకపోవటం 6. తల్లిదండ్రుల మాటలకు కట్టుబడి ఉండటం.

ఈ నైతిక విజ్ఞాన శాస్త్రం (Moral Science), ఇంగ్లీషు, తెలుగు పాఠ్య పుస్తకాలను గమనించినపుడు పాఠశాల స్థాయిలో తాత్త్వశాస్త్ర బోధన అంతగా లేదని దాని అవసరం ఉందని నిర్ధారించవచ్చు.

దీని ఆవశ్యకత ఉందనే విషయాన్ని గుర్తిస్తూ పలు మత సంస్థలు పిల్లల కోసం ఆదివారం నాడు ప్రత్యేక తరగతులను స్వచ్ఛందంగా నడుపుతున్నారు.

1. బ్రహ్మకుమారి సమాజం : ఓంకార నాదం, ద్వాదశలింగాల అవగాహన, యోగవిద్య.
2. రామకృష్ణ మఠం : విద్య, భక్తిని గురించి ఉపన్యాసాలు.
3. చర్చి మిషనరీ స్కూళ్ళలో మత బోధలో భాగంగా క్రమశిక్షణ పాఠాలు నేర్పిస్తారు. "చిన్న పిల్లలదే పరలోక రాజ్యం నా వద్దకు రానివ్వండి" అని సమావేశానికి పిల్లలు తన దగ్గరికి రాకుండా అటంక పరచినవారికి జీసస్ చెపుతాడు.
4. మసీదులలో శుక్రవారాలు దిన్ దునియా పేరుతో శిక్షణనిస్తున్నారు.

ఏకాగ్రత, ప్రార్థన, చిన్న పిల్లలతో పాఠాలు చెప్పించటం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీని ఆధారంగా నేటి సమాజంలో పిల్లలకు తత్త్వశాస్త్ర బోధనావశ్యకతను గుర్తించటానికి ఇంతకంటే నిదర్శనాలు అవసరం లేదు.

మరి ఈ తత్త్వశాస్త్ర బోధనావశ్యకత ఎవరికోసం, ఎందుకోసం అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి.

తత్త్వశాస్త్రం అంటే ఏమిటి అనే ప్రశ్నకు పలువురు పలు నిర్వచనాలనందించారు. తత్త్వశాస్త్ర నిర్వచనాలను తత్వజ్ఞులు అందించారు. కాని ఏ ఒక్కటీ మరొకరి నిర్వచనాలతో పోలిక ఉండదు. నిర్వచనాలు కాలానుగుణంగా మార్పు చేర్పు కూర్పులతో కొనసాగుతుంది. జీవిత తత్త్వమే కదా తత్త్వశాస్త్రం. తాత్త్వికత అంటే శూన్యమని, ఆత్మ, పరమాత్మ అనే దీర్ఘ విషయాంశాలు కాకుండా చిన్న చిన్న పదాలతో నిర్వచనాలను అందించవచ్చు. భగవద్గీత జీవితం ఒక సాధన అని చెపితే జీవితం అంతా యోగమే 'All life is Yoga' అని శ్రీ అరవిందులు అన్నారు. పదార్థాన్ని దివ్యంగా మలచటమే తత్త్వం అవుతుంది. తత్త్వజ్ఞుని స్వరూపాన్ని స్వభావాన్ని వేమన వివరించినంతగా ఏ తత్త్వవేత్త చెప్పాడు?

‘తిట్టి కొట్టిరేని తిరిగి మారాడక
చుట్టు నిట్టు జూచి యదరి పడక
తన్నుగాని యట్లు తత్వజ్ఞు డుండును
విశ్వదాభిరామ వినురవేమ’

'The miracle is not to fly in the air, or to walk on the water, but to walk on the earth' అనేది చైనా దేశీయుల సామెత. 'My life has a superb cast but i can't figure out the plot.' Ashleigh Brilliant నా జీవితంలో అనేక పాత్రలున్నాయి కాని జీవిత ఇతివృత్తాన్ని గుర్తించ లేకున్నాను అని అంటాడు ఆష్లే బ్రిలియంట్.

'I have measured out my life with coffee spoons' అని T.S. Eliot in 'The love song of J. Alfred Prufrock. 'Philosophy is the highest music', Plato, phaedo P.273. The pocket book of quotations.

“ఉత్తమా తత్త్వచింతాచ । మధ్యమం శాస్త్ర చింతనం ।
అథమా మంత్ర చింతాచ । తీర్థ భ్రాంత్యఽధమాధమం ॥” –హితోపదేశం, పుట–373లో

తత్త్వ విచారం ఉత్తమ మార్గం శాస్త్ర చింతనం మధ్యమాధికారం. మంత్రోపాసనం అథమమార్గం. ఇక తీర్థ పర్యటనాభివేశం అథమాథమం.

**ఎవరికోసం :** నన్నయ, తిమ్మయ కవులు 14 సంవత్సరాల లోపు వారిని బాలురన్నారు.

‘జన్మంబు మొదలుగా బదునాలుగు వత్సరంబులు
దాటునంతకు బురుషుండు బాలుండు
వారెద్ది సేసిన బాపంబు బెద్ద పొరయదు – నన్నయ భారతం, ఆది పర్వం 4, 272

పిల్లలకు ధారణాశక్తి అధికం కాబట్టి చిన్న వయస్సులోనే తాత్త్విక దృక్పథానికి అవసరమైన నేపథ్యాన్ని కలిగించాలి. ఎంతటి జ్ఞానాన్నైనా ఇముడ్చుకో గలుగుతారు అనటానికి ప్రహ్లాదుడు, నచికేతుడు, ధ్రువుడు, సిరియాళువు, మార్కండేయుడు, ఏకలవ్యుడు మొదలైనవారు ఎందరో బాల్య వయస్సులోనే పెద్దలను నిలదీసారు. నైతిక విలువల ప్రాథాన్యం పిల్లలలోనే కలగాలి. అందుకోసం తాత్త్విక దృక్పథాలుగల అంశాలను కథల రూపంలో సృజనాత్మకంగా చిత్రించి ప్రాథమిక స్థాయిలో వ్యక్తిగత వికాసానికి తోడ్పడేవిగా రూపొందించాలి. కారుణ్యానికి బుద్ధుని కథ, పితృప్రేమకు శ్రవణ కుమారుడు, శాంతం, సహనం, క్షమ, దయా దాక్షిణ్యాలకు జంతువుల కథలను ఉదాహరించవచ్చు.

**ఎందుకోసం :** 1.జీవిత తత్త్వం అవగతమవుతుంది. 2.వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుంది. 3.పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవటానికి ఆత్మ విశ్వాసం కలుగుతుంది. 4.అన్నిటికన్నా ముఖ్యమైనది మనోబలం; అది ఈనాటి పిల్లలకు కొరవడిందని చెప్పాల్సి ఉంది. తత్త్వశాస్త్రం జీవనానికి ఆధారం. అదిలేని జీవితం శూన్యం, నిలదొక్కుకోవటం కష్టం. నిలదొక్కుకున్నా జీవనంలో తృప్తి ఉండదు.

మన చుట్టూ ఉన్న పరిసరాలను, భగవంతుని ఉనికిని, మనం చూడలేకపోతున్నాం. బాహ్య సుఖాలతో వచ్చే కృత్రిమ ఆనందాన్ని శాశ్వతమని భావించి తృప్తి పొందుతున్నాం. కొంత కాలానికి అది బాధగా పరిణమించి దుఃఖిస్తాం. మన ఇంద్రియాలు సుఖాలకోసం పరుగులు పెడుతూ భగవత్ సాన్నిధ్యాన్ని, అందులో పొందే సంతోషాన్ని దూరం చేసుకుంటున్నాము. హిందూ దినపత్రికలో ప్రచురితమైన కథని ఇక్కడ ఉదాహరిస్తున్నాను.

శీతాకాలంలో ఒక కొలనులో ఒక తాబేలు ఈత కొడుతూ చల్లని నీటికి అసౌకర్యంగా ఉందని బాధపడింది. ఒక స్త్రీ ఆ తాబేలుని పట్టి ఇంటికి తీసుకువెళ్ళింది. కూరవండుకుందామని భావించింది. పొయ్యి రాజేసి పాత్ర

పెట్టి నీరుపోసి తాబేలును వేసింది. వెచ్చగా ఉందని సౌకర్యం, సుఖం, ఆనందం కలిగి ఈత కొట్టింది. నీళ్ళు వేడెక్కే కొద్ది అసౌకర్యం కలిగి కంగారు పడి మరిగిన నీటిలో దుఃఖంతో మరణించింది. మనకు బాహ్య విషయాలలో లభించే సంతోషం ఇటువంటిదే.

**చేయతగినది :** పరిశోధన చేసి ప్రాచ్య పాశ్చాత్య తాత్త్వికాంశాలను పిల్లలకోసం సరళీకరించి కథన రూపంలో సృజనాత్మకంగా ఆకర్షణీయంగా చెప్పటమే కాదు ఈనాటి పిల్లలను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నలకు సమాధానాలను అందించేవిగా ఉండాలి. మతపరమైన విషయాల జోలికి పోకుండా పాఠ్యాంశాలను పొందుపరచాలి. మత ప్రధానమైన రచనలు (Religious oriented) కావు. ఆధ్యాత్మిక రచనలు (Spiritual oriented) కావాలి.

స్థల, కాలాదులను దృష్టిలో పెట్టుకొని సమత పాటించి పాఠ్యాంశాల నిర్మాణం జరగాలి. దానికి సభ్యులు నిర్ణేతలు అవసరం. మానవీయ కోణంలో ఆధ్యాత్మికత అంటే ఏమిటి? అనే అంశాల గుర్తింపును విద్యాశాఖకు తెలియ పరచాలి.

**ముగింపు :** ప్రపంచ పరిణామ క్రమంలో ప్రగతి పథం వైపుగా మనిషిలో మార్పు రావాలి కాని Mobile phones లో మార్పులు కావు. ఆధునిక పరికరాలపై చూపే ఆసక్తి కన్నా తన్నుతాను సంస్కరించుకునే కోణంలో ఆసక్తిని చూపించి వ్యక్తి వికాస దశను చేరాలి. భౌతిక అవసరాల ఎదుగుదలని Material benefit ని ఎదుగుదల అంటారా? గ్రీకు, రోమన్ కాలం నుండి వస్తు సంపద ఎక్కువైనపుడు సమాజంలో క్షీణదశ ఏర్పడుతుందనే విషయాన్ని గమనించాం. భౌతిక సంపద ఆధ్యాత్మిక సంపదల సంతులనం ఉండాలి. ఏది ఎక్కువైనా అరిష్టమే. ఆధ్యాత్మిక సంపదతో బాటు సాంకేతికత కూడా పెరగాలి. ప్రాచీన కాలంలో ఆధ్యాత్మిక సంపదకు ప్రాధాన్యం ఇచ్చి భౌతిక సంపదకు ప్రాధాన్యం ఇవ్వకపోవటం వలన నాగరికత కుంటుపడింది. ఈనాడు సాంకేతికత అభివృద్ధి చెంది ఆధ్యాత్మిక సంపద వెనుకంజ వేస్తుంది. సాంకేతికతను కాపాడాలంటే ఆధ్యాత్మికత అవసరం. ఏ శాస్త్రమైనా అంతర్లీనమయ్యేది తత్త్వశాస్త్రంలోనే కదా. Technology is the other form of God. సమతుల్యతను పాటించే అవగాహన వ్యక్తిలో పెరగాలి. సాంకేతికత బాహ్య స్వరూపమయితే ఆధ్యాత్మికత ఆంతర స్వరూపమై సంపూర్ణత్వాన్ని సాధించాలి.

పాఠశాలల్లో తత్త్వశాస్త్ర బోధన ఆవశ్యకత వలన తత్త్వశాస్త్రశాఖ కళకళలాడుతుంది, గల గల మంటుంది అని అనుకుంటే అది భౌతిక మవుతుంది. దానివలన సమాజం బాగుపడుతుందనుకుంటే ఆధ్యాత్మిక మవుతుంది. ఏ రంగంలోనైనా ఇతర రంగాల అవగాహనతో పరిశోధనలు కొనసాగడం అత్యంత అవసరం. ఏ రంగంలోని వారు ఆ రంగానికే పరిమిత మయిపోతే పరిశోధనలో సంపూర్ణత్వాన్ని సాధించలేం. అంతర్ విద్యావిషయిక (Inter-Disciplinary), బహు విద్యావిషయిక (Multi-Disciplinary), సమగ్ర విద్యావిషయిక (Trans-Disciplinary Methodology) పద్ధతులను పరిశోధనా రంగంలో పాటించాలి. ఉదాహరణకు మానవులు ప్రకృతిని మూడు కోణాలలోనే దర్శించగలుగుతున్నారని; గబ్బిలాలు, కుక్కలు నాలుగు కోణాలలో దర్శించగలుగుతున్నాయని పరిశోధనల ద్వారా తెలియజేసి, మానవుడు పదకొండు కోణాలలో దర్శించగలిగితే భగవంతుణ్ణి చూడగలుగుతాడని ఆంత్రోపాలజి రంగం విశ్లేషించింది.

ఈ అవకాశాన్ని ఇచ్చిన ఉస్మానియా విశ్వవిద్యాలయం వారికి, తత్త్వశాస్త్ర శాఖ నిర్వాహకులకు కృతజ్ఞతలు. ఈ అంశాన్ని ఎన్నుకుని విద్యారంగంలో మార్పులు కోరుతున్న తత్త్వశాస్త్ర శాఖ సభ్యులందరికీ కృతజ్ఞతలు.